క్లుప్తంగా

ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సరెండర్

నడిగూడెం : మండల పరిధిలోని బృందావనపురం ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి పృథ్వీ, ఎకలాస్‌ఖాన్‌పేట పంచాయతీ కార్యదర్శి శోభన్‌బాబులను జిల్లా పంచాయతీరాజ్ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు ఎంపీడీఓ యం.యద్రయ్య సోమవారం విలేకరులకు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. బృందావనపురం గ్రామానికి చెన్నకేశ్వాపురం కార్యదర్శి, ఎకలాస్‌ఖాన్‌పేట గ్రామానికి తెల్లబల్లి పంచాయతీ కార్యదర్శికి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

కల్యాణ మండపానికి రూ.5లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న ముత్తినేని సైదేశ్వరరావు

కోదాడరూరల్ : మండలంలోని దోరకుంట శివారులో కాకతీయ కమ్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కల్యాణ మండపానికి ఎస్వీ కళాశాలల చైర్మన్ ముత్తినేని సైదేశ్వరరావు రూ.5 లక్షల విరాళం ప్రకటించారు. సోమవారం ముందుగా లక్ష రూపాయల చెక్కును నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు నలజాల శ్రీనివాసరావు, కోశాధికారి ముత్తవరపు రామారావు, ఏర్నేని శ్రీరామ్ ఉన్నారు.

గణపవరం సర్పంచ్, కార్యదర్శికి సన్మానం



సర్పంచ్, కార్యదర్శిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు

మునగాల : స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డుల్లో భాగంగా గణపవరం రాష్ట్రస్థాయికి ఎంపికైన సందర్భంగా ఆ గ్రామ సర్పంచ్ కొండపల్లి విజయమ్మ, పంచాయతీ కార్యదర్శి దేవిరెడ్డి వీరారెడ్డిని సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎలక బిందు, వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, జెడ్పీటీసీ ప్రమీల, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, ఏపీఓ శైలజ అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆలయాల పునర్నిర్మాణానికి నిధులు మంజూరు

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో మరో రెండు దేవాలయాల పునర్నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే సైదిరెడ్డి కృషితో పాలకీడు మండలంలోని హనుమయ్యగూడెం పరిధిలో గల బాపూజీతండాలో ఉన్న శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి రూ.50 లక్షలు హుజూర్‌నగర్ మండలం లక్కవరంలో ఉన్న శ్రీ గంగమ్మ, శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయాలకు రూ.50 లక్షలు మంజూరు చేస్తూ ఉన్నతాధికారులు జీఓ జారీ చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బహుజన రాజ్యాధికారమే బీఎస్పీ లక్ష్యం



కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

హుజూర్‌నగర్ : బహుజన రాజ్యాధికారమే బీఎస్పీ లక్ష్యమని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దేశగాని సాంబశివగౌడ్ అన్నారు. సోమవారం హుజూర్‌గర్‌లో బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం వర్ధంతిని ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు మంద రవి ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా మహిళా కన్వీనర్ వి.నాగమణి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.సుబ్బుగౌడ్, నాయకులు ఎం.రమణ, కోకన్వీనర్ కె.సునీత, మహేష్, హరీష్, కళ్యాణ్‌వర్మ, శివకళ్యాణ్, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోదాడ : పట్టణ పరిధిలోని కేఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న రెండు సబ్జెక్ట్‌లకు అతిథి అధ్యాపకులుగా పనిచేయడానికి ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నాగు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. తెలుగు సబ్జెక్ట్‌లో ఒక పోస్టు, రాజనీతి శాస్త్రంలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు. నెట్, సెట్, పీహెచ్‌డీ, బోధన అనుభవం ఉన్న వారు ఈ నెల 12 లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. 13 వ తేదీన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు.

కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



మునగాల: ముక్త్యాల కాలువకు నీటిని విడుదల చేసి, గంగకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్



మోతె : గులాబీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

మోతె : సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం మోతె మండల పరిధిలోని నర్సింహాపురం, సర్వారం, బుర్కచర్ల గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బుర్కచర్ల, సర్వారం గ్రామాల్లో కాంగ్రెస్, సీపీఎం పార్టీల నుంచి సుమారు 400 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శీలం సైదులు, ఏలూరి వెంకటేశ్వరరావు, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు శోభారాణి, సర్వారం సొసైటీ చైర్మన్ ముప్పాని శ్రీధర్‌రెడ్డి, షేక్ జానీపాష, సతీష్‌బాబు, నూకల శ్రీనివాసరెడ్డి, గురుకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ముక్త్యాల కాలువకు నీటి విడుదల

మునగాల : సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు పరిధిలోని మొదటి జోన్‌లో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పైర్లను కాపాడేందుకు ప్రభుత్వం ఆరుతడి పద్ధతిన నీటిని విడుదల చేస్తోందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తెలిపారు. సోమవారం మునగాల శివారులోని ఎడమకాలువ ప్రధాన లాకుల వద్ద ముక్త్యాల బ్రాంచి కాలువకు ఆయన నీటిని విడుదల చేసి మాట్లాడారు. పది రోజుల పాటు కొనసాగే నీటి విడుదలతో ఆయకట్టులో ఎండిపోయే దశకు చేరుకున్న పైర్లకు ప్రాణం పోసినట్లయిందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నెస్పీ ఈఈలు శ్రీనివాసాచార్యులు, సత్యనారాయణ, ఏఈ సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు జానీ, వెంకటనారాయణ, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తొగరు రమేష్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సుంకర అజయ్‌కుమార్, హుజుర్‌నగర్ ఎంపీపీ గూడెపు శ్రీను, పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ, వి.లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలి

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బిందు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, జెడ్పీటీసీ ప్రమీల, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుడి నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని సోమవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య హోమం, శ్రీమూలవిరాట్‌కి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణ తంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. శివాలయంలో శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి మహారుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ గెలుపునకు కృషిచేయాలి

మునగాల : బీఆర్‌ఎస్ పార్టీ గెలుపునకు పార్టీ గ్రామ కోఆర్డినేటర్లు కృషిచేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సుంకర అజయ్‌కుమార్ కోరారు. సోమవారం నర్సింహులగూడెం, రేపాల, కలకోవ, నారాయణగూడెం గ్రామాల్లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. వార్డుల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల నాయకులు నల్లపాటి శ్రీనివాస్, ఉప్పుల యుగంధర్‌రెడ్డి, గోపిరెడ్డి నాగిరెడ్డి, ఉడుం కృష్ణ, సర్పంచ్‌లు ప్రమీల, సుజాత, రమణ, ఎంపీటీసీ భవాని, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఎంపీటీసీల అసహనం

గరిడేపల్లి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు అందించి వారిని ఆదుకోడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. కాగా దళితబంధు, బీసీ బంధు, గృహలక్ష్మి పథకాలకు లబ్ధిదారుల ఎంపిక చేయడంలో అధికార పార్టీ నాయకులు, అధికారుల తీరుపై ప్రతిపక్ష ఎంపీటీసీలు పాకల పరమేష్, బాల్దూరి సందీప్‌లు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అర్హులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాల్సి ఉండగా, ప్రజాప్రతినిధులకు తెలియకుండా ఎంపిక చేస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలే పథకాల యూనిట్లను పంచుకుంటున్నారని అలాంటప్పుడు ప్రజాప్రతినిధులుగా ఉండడం దేనికని మండిపడ్డారు. దళితబంధు, గృహలక్ష్మి, బీసీబంధు, మైనార్టీ బంధు పథకాలకు సంబంధించిన వివరాలను ఎజెండాలో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, పైఅధికారుల సూచనల మేరకు మేము నడుచుకుంటామని ఎంపీడీఓ వనజ సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ మౌలానా, ఏపీఓ సురేష్, వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీల, వెంకటరమణారెడ్డి, సర్పంచ్‌లు యడవెల్లి చంద్రారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన పల్లె దవాఖానాలు



పల్లె దవాఖానాను ప్రారంభించిన ఎంపీపీ సుజాత

గరిడేపల్లి : పేద ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండటం కోసం ప్రభుత్వం పల్లె దవాఖానాలను గ్రామగ్రామాన ఏర్పాటు చేస్తుందని ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని తాళ్లమల్కాపురం గ్రామంలో రూ.13.5 లక్షలతో పల్లె దవాఖాన, రూ.10 లక్షల వ్యయంతో అంగన్‌వాడీ కేంద్రం, గడ్డిపల్లిలో రూ.13.5 లక్షలతో పల్లె దవాఖాన, రైతు సేవా సంఘం కార్యాలయం, అబ్బిరెడ్డిగూడెంలో రూ.13.5 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానాలను సోమవారం ఆమె ప్రారంభించారు. అబ్బిరెడ్డిగూడెంలో క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. అదేవిధంగా గడ్డిపల్లిలో స్వర్గీయ గంటా గోపాల్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కన్మంతరెడ్డి వనజ, ఎంపీఓ మౌలానా, ఏపీఓ సురేష్, సర్పంచ్‌లు కుక్కడపు జ్యోతిగుర్వయ్య, సుందరి నాగేశ్వర్‌రావు, కాశయ్య, ఎంపీటీసీలు రాములు, స్రవంతిశోభన్‌బాబు, ఇసాక్, రైతు సేవా సంఘం చైర్మన్ గంటా సుధాకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పథకాలు అనర్హులకు కేటాయించడంపై ఆందోళనలు



హుజూర్‌నగర్‌రూరల్ : లక్కవరంలో పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళితులు



నేరేడుచర్ల : రహదారిపై రాస్తారోకో చేస్తున్న అఖిలపక్ష నాయకులు



గరిడేపల్లి : ఎంపీడీఓ వనజకు వినతిపత్రం అందజేస్తున్న దళితులు

నేరేడుచర్ల : దళిత బంధు, బీసీ బంధుతో పాటు పలు సంక్షేమ పథకాలను అనర్హులకు కేటాయిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం నేరేడుచర్లలో అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల పక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు అందుతున్నాయని ఆరోపించారు. అధికారులతో సంబంధం లేకుండా అధికార పార్టీ నాయకులే లబ్ధిదారులను ఎంపిక చేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు, సీపీఎం పట్టణ కార్యదర్శి కోదమగుండ్ల నగేష్, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్, టీడీపీ జిల్లా నాయకుడు పాల్వాయి రమేష్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగేశ్వర్‌రావు, కౌన్సిలర్లు బచ్చలకూరి ప్రకాశ్, రణపంగ నాగయ్య, రావుల సత్యం, శ్రీను, రామ్మూర్తి, పిచ్చిరెడ్డి, పాండునాయక్, రామస్వామి తదితరులు ఉన్నారు.

సర్పంచ్ ఇంటి ఎదుట దళితుల నిరసన

గరిడేపల్లి : అనర్హులకు దళితబంధు ఇచ్చారని ఆరోపిస్తూ మండల పరిధిలోని పరెడ్డిగూడెం గ్రామంలో ఆ గ్రామ సర్పంచ్ ఇంటి ఎదుట సోమవారం దళితులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు దళితులు మాట్లాడుతూ గ్రామంలో అనర్హులకు, సర్పంచ్ బినామీలకు దళితబంధు ఇచ్చారని ఆరోపించారు. అనంతరం మండల కేంద్రంలో ఎంపీడీఓ వనజకు వినపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి నర్సిరెడ్డి, మేకల మల్లారెడ్డి, అంబటి బాల్‌రెడ్డి, గ్రామ దళితులు పిట్ట రమేష్, అమరవరపు నర్సయ్య, కంతి మిన్నయ్య, కంతి నాగార్జున, కేతపల్లి నర్సయ్య, సునిత తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు.. అర్హులకే ఇవ్వాలి

హుజూర్‌నగర్‌రూరల్ : అనర్హులకు ఇచ్చిన దళితబంధును రద్దు చేసి అర్హులకు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ సూర్యాపేట జిల్లా కన్వీనర్ అంజనపల్లి సుదర్శన్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని లక్కవరంలో దళితులతో కలిసి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. గ్రామంలోని పేదలైన దళితులకు దళిత బంధు ఇవ్వకుండా భూములు, ఆస్తులు ఉన్నవారికి ఇస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు వారి అనుచరులకు, బినామీలకు దళితబంధు వచ్చేలా పైరవీలు చేస్తున్నారని ఆరోపించారు. తదనంతరం మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కస్తాల కనకయ్య, రణపంగు రత్తయ్య, కస్తాల శ్రవణ్, నరేష్, మైసయ్య, మట్టయ్య, అచ్చమ్మ, రమణ, చిన్నమ్మాయి, కాశమ్మ పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా దళితబంధు వర్తింపజేయాలి

చిలుకూరు : దళితబంధు పథకాన్ని పార్టీలకతీతంగా అర్హులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ చిలుకూరులోని రావినారాయణరెడ్డి కాలనీవాసులు ఆదివారం రాత్రి అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితబంధు పథకం కేవలం బీఆర్‌ఎస్ కార్యకర్తలకు మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ అమలు చేయాలి



హుజూర్‌నగర్ : డీటీ లావణ్యకు వినతిపత్రం ఇస్తున్న రాష్ట్ర రైతు సంఘం నాయకులు



చిలుకూరు : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

హుజూర్‌నగర్ : రైతులందరికీ లక్ష రుణమాఫీని జాప్యం చేయకుండా అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొప్పోజు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం హుజూర్‌నగర్ ఆర్‌డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపి డీటీ లావణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీకి అవసరమైన మొత్తం డబ్బును బ్యాంకులలో జమ చేసి వెంటనే రుణమాఫీ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు పోకల వెంకటేశ్వర్లు, జక్కుల రమేష్, జక్కుల రమణ, ఈద్పుగంటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితులందరికీ న్యాయం చేయాలని ధర్నా..

దళితబంధు పథకం అమలులో దళితులందరికీ న్యాయం చేయాలని హుజూర్‌నగర్ ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డీటీ లావణ్యకు వినతి పత్రం అంద జేశారు. కార్యక్రమంలో దళితులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలి

కోదాడరూరల్ : ఎన్నికల సమయంలో రైతులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నెం పాపిరెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కోదాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డీటీకి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అర్హత ఉన్న రైతులందరికీ లక్ష రూపాయల రుణమాఫీ కాకపోతే వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. దేసిరెడ్డి సైదిరెడ్డి, మేకల శ్రీను, ఎస్‌కె.లతీఫ్, సత్యనారాయణరెడ్డి, గాంధీ, ప్రసాద్, కోటేశ్వరరావు, భిక్షమయ్య, దశరథ, రమేష్ ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

చిలుకూరు : అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ రుణమాఫీ అమలుచేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చిలుకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా నేటివరకు రుణమాఫీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సరితకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సాహెబ్ అలీ, మాదవరపు లక్ష్మయ్య, దొడ్డా రాంబాబు, రామారావు, వెంకటేశ్వర్లు, సీతమ్మ, దశరథ, పార్వతి, మణి, శ్రీలత, లక్ష్మి, పుల్లమ్మ పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు



పట్టుబడ్డ ఆటో, బెల్లంతో ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్: మఠంపల్లి మండలం కొత్తతండా, పాతతండాలలో ఎక్సైజ్, సివిల్ పోలీసులు సోమవారం సంయుక్తంగా దాడులు జరిపారు. ఈ దాడుల్లో కొత్తతండాకు చెందిన ధరావత్ రాజా ఇంట్లో 8 లీటర్ల సారా లభించింది. రాజా పారిపోగా అతడి భార్య తిరుపతమ్మను అదుపులోకి తీసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. అదేవిధంగా కొత్త తండా, పాతతండా గ్రామాల శివారుల్లో దాచి ఉంచిన 1000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

200 కేజీల బెల్లం స్వాధీనం..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుంచి మఠంపల్లి మండలంలోని కొత్తతండాకు ఆటోలో బెల్లం తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు తండా శివారులో ఆటోను పట్టుకున్నారు. చింతలపాలెం మండలం యర్రకుంటతండాకు చెందిన భూక్య శంకర్ ఆటోలో రాజేష్ అనే వ్యక్తి ద్వారా లాలితండాకు చెందిన సాయికి బెల్లంను పంపిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రాజేష్, సాయిని అదుపులోకి తీసుకుని వారితో పాటు భూక్య శంకర్, ఆటో యజమాని రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్‌ఐలు దివ్య, జగన్‌మోహన్‌రెడ్డి, మఠంపల్లి ఎస్‌ఐ బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ

మేళ్లచెరువు : మండల కేంద్రంతో పాటు రామాపురం, హేమ్లాతండా, వెల్లటూరు, కందిబండ గ్రామాల్లో సోమవారం లబ్ధిదారులకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రేషన్ డీలర్లు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, నాయకులు

నేరేడుచర్ల : మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు తక్షణమే మంజూరు చేయాలని సోమవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నేరేడుచర్లలో విద్యార్థులు ఖాళీ ప్లేట్లతో రాస్తారోకో నిర్వహించారు. కార్మికుల సమ్మెతో మధ్యాహ్న భోజనానికి ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పాలక ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, సీపీఐ నాయకులు కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు రేఖ ఉపేందర్ తదితరులు ఉన్నారు.

వేప నూనె, జిగురు అట్టలు పంపిణీ



వేప నూనె, జిగురు అట్టలు పంపిణీ చేస్తున్న కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్ లవకుమార్

గరిడేపల్లి: గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా కూరగాయల పంటలు సాగుచేసే గిరిజన రైతులకు గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం లీటరు వేప నూనె, జిగురు అట్టలు(నీలం, పసుపు, తెలుపు), పురుగులను ఆకర్షించే సోలార్ లైట్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి. లవకుమార్ మాట్లాడుతూ.. వేప నూనె, జిగురు అట్టలను సరైన సమయంలో ఉపయోగిస్తే పురుగులను సమర్థవంతంగా అరికట్టవచ్చని అన్నారు. అనంతరం కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డి. ఆదర్శ్ మాట్లాడుతూ.. పురుగులను ఆకర్షించే సోలార్ లైట్‌ను అమర్చుకొనే విధానం, దానిని వాడకం గురించి రైతులకు తెలియజేశారు. జిగురు అట్టలను అమర్చుకుంటే తెల్ల దోమ, పచ్చ దోమ, తామర పురుగులు, నల్లి వంటి రసం పీల్చే పురుగుల నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త నరేష్, రైతులు రవి, గోపి, రాములు, శ్రీరాములు పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన



హుజూర్‌నగర్ : అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ అర్చన

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. సోమవారం మధ్యాహ్నం ఎన్నికల నియమావళి అమలులోకి వస్తుందన్న సమాచారం తెలియడంతో కోడ్ అమలులోకి రాకముందే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను పోటీపడీ మరి కానిచ్చేశారు. మున్సిపాలిటీలో పట్టణ ప్రగతి, ఆర్థిక సంఘం నిధులు రూ 1.19 కోట్లతో చేపట్టే 39 అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి నిధులు దాదాపు రూ 2.40 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, పార్టీల నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

మునగాల : మండలంలోని తాడువాయిలోని ఐదవ వార్డులో మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మాతంగి బసవయ్య, మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు లక్ష్మమ్మ, మంగతాయారు, వెంకన్న, గ్రామపెద్దలు వీరయ్య, శంకర్, నరసయ్య, వినయ్ పాల్గొన్నారు.

మునగాలలో..

మునగాలలోని ఎస్సీ కాలనీలో గల లైబ్రరీ వీధిలో ఎంపీ ఉత్తమ్ నిధుల నుంచి మంజూరైన రూ.8లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులకు సోమవారం సర్పంచ్ చింతకాయల ఉపేందర్ శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీలు కాసర్ల కల్పన, ఉప్పుల రజిత, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విజయరాఘవపురంలో..

విజయరాఘవపురంలో సోమవారం రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సుంకర అజయ్‌కుమార్ స్థానిక సర్పంచ్‌తో కలిసి పల్లెప్రగతిలో రూపుదిద్దుకున్న పబ్లిక్ పార్క్‌లో గదుల నిర్మాణం, రూ.ఐదు లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ గుండు లింగారావు, కార్యదర్శి సుధాకర్, వార్డు సభ్యులు కోటయ్య, వెంకటేష్, అనూష, కోఆప్షన్ సభ్యుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చిలుకూరు : మండల కేంద్రంలోని రావినారాయణరెడ్డి కాలనీ 6వ వార్డులో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధులు రూ.4 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం సర్పంచ్ కొడారు బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి పింగ్రాతి హనుమంతరావు, నాయకులు యడవెల్లి పుల్లారావు, గరిణె శేషగిరిరావు, వెంకటయ్య, నాగయ్య, సోందుమియా, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : మండల పరిధిలోని కాపుగల్లులో ఎంపీ ఉత్తమ్‌కుమారెడ్డి నిధులు రూ.12లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, గ్రామ శాఖ అధ్యక్షుడు కాసాని రామారావు సోమవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ముత్తవరపు వీరయ్య, పాలంపల్లి వీరబాబు, కనకయ్య, రేవూరి కోటయ్యచారి, విజయ్, ముత్తవరపు, మురళి, శ్రీను తదితరులు ఉన్నారు.

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ఎంపీ ఉత్తమ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొణతం చిన వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు బచ్చలకూరి ప్రకాశ్, బైరెడ్డి జితేందర్‌లతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పాలకీడు ఎంపీపీ భూక్య గోపాల్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి, నాయకులు శ్రీను, ప్రభాకర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్‌రావు, రోషన్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు, రేపు మాజీ ఎమ్మెల్యే పద్మావతి పర్యటన

మునగాల : మాజీ ఎమ్మెల్యే ఎస్.పద్మావతి మంగళ, బుధవారాల్లో మునగాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొప్పుల జైపాల్‌రెడ్డి, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మున్సిపల్ మాజీ చెర్మన్‌కు పరామర్శ

హుజూర్‌నగర్ : ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న హుజూర్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ జక్కుల వెంకయ్యను సోమవారం మాజీ కౌన్సిలర్లు పరామర్శించారు. మాజీ కౌన్సిలర్లు తేజావత్ రవినాయక్, కంకణాల పుల్లయ్య, జడ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు రాములు, పిచ్చయ్య, శ్రీనివాస్, రాము, శ్రీను పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి

హుజూర్‌నగర్ : యాజమాన్యాలు కార్మికులకు న్యాయం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. సోమవారం హుజూర్‌నగర్‌లో రైస్ మిల్ డ్రైవర్స్ యూనియన్ గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్మిక సంఘాల నాయకులు గురువయ్య, ఉపేందర్, శ్రీను, రాములు, మల్లయ్య, రాము, సైదులు, జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ చైర్మన్, ధర్మకర్తకు సన్మానం

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీపార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ బెల్లకొండ అమర్‌గౌడ్, ధర్మకర్త శీలం సైదులును సోమవారం జనచైతన్య ట్రస్ట్ సభ్యులు శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా కనకదుర్గ దేవాలయ ట్రస్ట్ సభ్యుడు ధర్మకర్త పెద్ది పుష్పను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని వినతి

మఠంపల్లి : మండలంలోని వివిధ గ్రామాలు, తండాల పరిధిలో ఏళ్ల తరబడి అటవీ భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులకు ప్రభుత్వం అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలివ్వాలని కోరుతూ సోమవారం మఠంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు పాండునాయక్, జిల్లా అధ్యక్షుడు బాలునాయక్, కేశ్యా, శ్రీను, లింగ్యా, నాగేశ్వరరావు, బాలు, మక్కా, బద్రు, శివ, శంకర్, రాము, తులసీ, చీనా, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తపాలా దినోత్సవం

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని తపాలా కార్యాలయంలో సోమవారం తపాల దినోత్సవాన్ని సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తపాల అధికారులు గోపిరెడ్డి వీరారెడ్డి, అశ్విన్, శివ, వినాయక్‌లను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, కొణతం సీతారాంరెడ్డి, ఫోరెడ్డి శ్రీరాంరెడ్డి, మధు, శ్రీనివాస్‌రావు, సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.